





## పార్టీ పదవి నుంచి తప్పుకోనున్న దురైమురుగన్?

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా సీనియర్ మంత్రి దురైమురుగన్ డీఎంకే ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేయనున్నట్లు సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. నీటిపారుదలశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న దురైమురుగన్ 88వ వసంతంలోకి అడుగుపెట్టారు. వృద్ధాప్యం, అస్వస్థత కారణంగా ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్నారు. అంతేకాకుండా కొన్ని నెలలుగా వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి వెళుతున్నారు. డీఎంకేలో అధ్యక్ష పదవి తర్వాత కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవి డీఎంకే ప్రారంభించిన సమయంలో ద్రావిడ ఉద్యమానికి పెరియార్ అధ్యక్షుడిగా కొన్నాళ్లు వ్యవహరించారు. ఆ తర్వాత దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పార్టీ అధ్యక్షుడిగా, అన్బళగన్ ప్రధాన కార్యదర్శిగా పార్టీని అభివృద్ధి పథంలో నడిపించారు. అన్బళగన్ దివంగతులైయ్యాక దురైమురుగన్ ప్రధాన కార్యదర్శిగా గత ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. ఒకవేళ ఆయన తన పార్టీ పదవికి రాజీనామా చేసినట్లైతే ఎంపీ జగద్రక్షగన్‌కు ఆ స్థానం దక్కే అవకాశముందని డీఎంకే వర్గాలు తెలిపాయి.

## పార్టీ కోసం నగలిచ్చిన జయలలిత

● మాజీ మంత్రి సెంగోట్టయ్యన్

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి జయలలిత పార్టీకి ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనేవారని, పార్టీ శ్రేణులను, నేతలను కుటుంబ సభ్యులుగా భావించేవారని, పార్టీ అభివృద్ధి కోసం వారు ఎన్నో త్యాగా లు చేశారని మాజీ మంత్రి సెంగోట్టయ్యన్ అన్నారు. ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళయంలో ఆదివారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1989లో అన్నాడీఎంకేలో తీవ్ర సంక్షోభం నెలకొన్నప్పుడు పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న నేతలను జయలలిత పిలిచి, వారికి నగలు, ఇతర విలువైన వస్తువులను ఇచ్చి వాటిని విక్రయించి పార్టీ కోసం ఖర్చుపెట్టమన్నారని, అలాంటి త్యాగగుణం నేడు పార్టీ నడుపుతున్న ఎడప్పాడి పళనిస్వామికి ఏ మాత్రం లేదని విమర్శించారు. జయలలితకు క్షమాగుణం అధికమని, పార్టీసీనియర్లు ఎందరినో ఆమె కోపగించుకున్నా, కొన్నాళ్ల తర్వాత వారిని స్వయంగా పిలిపించి, జరిగినదంతా మరిచిపోండి పార్టీ అభివృద్ధికి పాటుపడండి అంటూ హితవు పలికేవారన్నారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యక్రమాలను ప్రకటించి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటానని సెంగోట్టయ్యన్ పేర్కొన్నారు.



దివంగత మాజీ సీఎం జయలలిత

# 'సర్' పేరిట కేంద్రం కుట్ర

● ప్రతిచోటా నిఘా వేయండి ● డీఎంకే జిల్లా నేతలకు స్టాలిన్ దిశానిర్దేశం



క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించేందుకు కేంద్రంలోని పాలకులు కుట్ర పన్నుతున్నారని సీఎం స్టాలిన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా నేతలు అప్రమత్తంగా వ్యవహరించి, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో జరుగుతున్న 'సర్' ప్రక్రియపై నిఘా వేయాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచించారు. ఆదివారం ఉదయం చెన్నై క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా శాఖ కార్యదర్శులు, పార్టీకి చెందిన ఎంపీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ 'సర్'కు వ్యతిరేకంగా ఈ నెల 11న జిల్లా కేంద్రాల్లో డీఎంకే, మిత్రపక్షాల ఆధ్వర్యంలో జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి, అడ్డదారిలో అధికారంలోకి రావాలని తహతహలాడుతున్న బీజేపీ పాలకులు ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని 'సర్' పేరుతో ఓట్ల చోరీకి పాల్పడనుందని, బిహార్ తరహాలో ఓటర్లను తొలగించేందుకు పథకం వేసుకున్నారని, రాష్ట్రంలో వారి పథకం నెరవేరకుండా జిల్లా కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మిత్రపక్షాల నాయకులతో కలిసి అర్హుల పేర్లు తొలగించకుండా జాగ్రత్త వహించాలని, ఈ విషయంలో పార్టీ అధిష్టాన వర్గానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తే పార్టీ న్యాయవిభాగం ద్వారా ఆ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాతే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరపాలని అన్ని పార్టీలు డిమాండ్ చేసినా కేంద్ర ఎన్నికల సంఘం మొండివైఖరి ప్రదర్శించి సవరణ ప్రక్రియను డిసెంబర్ నాలుగు వరకు జరిపేందుకు సిద్ధమైందని ఆరోపించారు. మతతత్త్వ పార్టీ బీజేపీకి ఓటు వేయని ముస్లిం మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల ఓటర్ల పేర్లను తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తనకు సమాచారం అందిందని, జిల్లా కార్యదర్శులు ఈ విషయంలో ఏ మాత్రం సోమరితనం ప్రదర్శించినా రాష్ట్రానికి చేటు కలుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారాన్ని కూడా తక్షణమే ప్రారంభించాలని, ప్రభుత్వ పథకాలు, కేంద్రంలోని బీజేపీ పాలకులు రాష్ట్రానికి కలిగించిన నష్టాలపై ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రచారం జరపాలని, డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాలను కరపత్రాలుగా ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని స్టాలిన్ దిశా నిర్దేశం చేశారు.

### బీఎల్వోగా జ్యూస్‌షాప్ కార్మికురాలు..!

ఇదిలా ఉండగా నగరంలోని వేళచ్చేరిలో 'సర్' పనుల్లో ఎన్నికల సిబ్బందికి బదులు ఆ ప్రాంతంలో శీతలపానీయాల దుకాణంలో పనిచేస్తున్న ఓ మహిళ వెళ్లడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు కరాటే త్యాగరాజన్ గుర్తించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వేళచ్చేరి నియోజకవర్గం పరిధిలోని 87వ వార్డులో పోలింగ్ కేంద్రం ఆఫీసర్‌గా జ్యూస్‌షాప్‌లో పనిచేసే కార్మికురాలిని నియమించారని బీజేపీ నేతలు పేర్కొన్నారు. జ్యూస్‌షాప్‌లో కార్మికురాలిగా పనిచేస్తున్న సుభాషిణి (బూత్ లెవల్ ఆఫీసర్) 'సర్'కు సంబంధించిన పనులు చేస్తోందని, ఆ విషయమై తాను ప్రశ్నించినప్పుడు కార్పొరేషన్ అధికారులు తనకు గతంలో ఇలాంటి పనులు అప్పగించారని, ఈ జాబితా సవరణ గురించి తనకేమీ తెలియవని, ఇంటింటికీ వెళ్లి ఫారాలు ఇస్తున్నానని తనకు తెలిపిందని కరాటే త్యాగరాజన్ పేర్కొన్నారు.

● కరూర్ దుర్ఘటన....

## టీవీకే కార్యాలయ నిర్వాహకుల విచారణ



సీబీఐ విచారణకు వెళ్తున్న టీవీకే నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రధాన కార్యాలయ నిర్వాహకులు ముగ్గురిని సీబీఐ అధికారులు విచారణ జరిపారు. సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే అధ్యక్షుడు విజయ్ రోడ్‌షోలో తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని సీబీఐ బృందం ఇప్పటివరకు స్థానికులు, బందోబస్తుకు వెళ్లిన పోలీసులు సహా 20 మందిని విచారించారు. చెన్నై పనయూర్‌లోని టీవీకే కార్యాలయ సహాయకుడు గురుచరణ్ తదితరులు ఆదివారం ఉదయం సీబీఐ ముందు హాజరైయ్యారు. ఈ సందర్భంగా కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే ప్రచార వాహనాలకు అమర్చిన సీసీ ఫుటేజీ సమర్పించాలని సీబీఐ సమన్లు జారీచేసిన నేపథ్యంలో సీసీ ఫుటేజీని ఆ పార్టీ న్యాయవాదులు, నిర్వాహకులు సీబీఐ అధికారులకు అప్పగించారు. ఆదివారం టీవీకే న్యాయవాది అరసు సహా ముగ్గురు నిర్వాహకులు సీసీ ఫుటేజీ, కార్యక్రమంలో పాల్గొన్న వారి వివరాలు, పలు పత్రాలతో కూడిన బ్యాగును సీబీఐ అధికారులకు అప్పగించినట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.

## రేషన్ పంపిణీలో డీఎంకే ప్రభుత్వం విఫలం

● ఎడప్పాడి పళనిస్వామి విమర్శ

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులను ప్రజలకు అందించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) విమర్శించారు. డీఎంకే ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఎక్స్‌పేజీలో ఆయన ఆదివారం పోస్టు చేశారు. రాష్ట్రంలోని 12,753 చౌకదుకాణాల్లో గోదుమలు పంపిణీ చేయడంలేదని, నవంబరు నెలకు కేంద్ర ప్రభుత్వం 8,725 టన్నుల గోదుమలను చౌకదుకాణాలకు కేటాయించిందని ఈపీఎస్ వివరించారు. కందిపప్పు, పామాయిల్ కొరతపై అన్నాడీఎంకే రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని వ్యాఖ్యానించారు. ఈ డీఎంకే మోడల్ ప్రభుత్వంలో మిగతా శాఖల కంటే పౌరసరఫరాలశాఖ చురుగ్గా పనిచేస్తుందని, పాలకులు అబద్ధాలు చెబుతున్నారని, ధాన్యం కొనుగోలు నుంచి గోదుమల వినియోగం వరకు నిత్యావసర సరుకులను ప్రజలకు అందించడంలో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఖండించదగ్గదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని రేషన్ దుకాణాల్లో గోదుమలు విక్రయించేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఈపీఎస్ హెచ్చరించారు.

## బహుముఖ పరిజ్ఞానం విద్యార్థులకు అవసరం

● హయగ్రీవ ఇష్టిలో చిన్నజీయర్ స్వామి ఉద్బోధ

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పోటీపడేలా విద్యార్థులు బహుముఖ పరిజ్ఞానంతో ముందుకు సాగాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ఉద్బోధించారు. పెరంబూరులోని ఎస్పీఆర్ సిటీలో సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో సమత్వ, శాంతి, సౌఖ్యాభివృద్ధి కోసం మహాయజ్ఞంగా ప్రారంభమైన స్వాహ్నిక పంచకుండాత్మక 'సమతా ఇష్టి' నాలుగో రోజు కార్యక్రమం ఆదివారం చిన్న జీయర్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు తీర్థగోష్టి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, భగవత్ రామానుజులకు తిరుమంజనం, 10.35 గంటలకు వేంకటేశ్వరపూజ, మధ్యాహ్నం 12 గంటలకు ఉదయపూర్ణాహుతి తదితర పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన హయగ్రీవ ఇష్టిలో విద్యార్థులు పాల్గొన్నారు. రామానుజ అష్టకాలు, రామానుజుల దివ్యప్రబంధం, రామాయణం, సంప్రదాయ గ్రంథాలు, చిత్రలేఖనం తదితర అంశాలపై చెన్నై జెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 250 మంది విద్యార్థిని, విద్యార్థులకు చిన్నజీయర్ స్వామి జ్ఞాపికలతో పాటు బహుమతులందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి చిన్న జీయర్ అనుగ్రహ భాషణం చేస్తూ.. విద్యార్థి దశ నుంచే సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. పిల్లలకు రామాయణంలోని కీలకఘట్టాల గురించి అవగాహన కల్పించే విధంగా జెట్-చెన్నై విభాగం వారు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందింపజేయాలన్న లక్ష్యంతోనే సమతా ఇష్టిని మహాయజ్ఞంలా విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. ప్రజ్ఞా విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలో రామానుజులు, ఆండాళ్, సమతా మూర్తి జీవిత విశేషాలు, భగవంతుడి నామస్మరణ వల్ల కలిగే ప్రయోజనాలపై నాటిక ప్రదర్శించారు. కాగా, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, గోపూజ, రాత్రి 8.30 గంటలకు సాయంకాల పూర్ణాహుతి, తిరుమంజనం పూజ అనంతరం భక్తులందరికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.



భగవద్ రామానుజుల సేవలో....



భక్తులకు తీర్థం ఇస్తున్న చిన్నజీయర్ స్వామి

## పోలీసు పరీక్షకు 2.25 లక్షలమంది హాజరు



చెన్నైలోని పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థి హాల్‌టికెట్ పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా 45 కేంద్రాల్లో రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు 2.25 లక్షలమంది హాజరయ్యారు. నగరంలో ఏర్పాటు చేసిన పది కేంద్రాల్లో 9915 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఆగస్టులో 3665 ద్వితీయ శ్రేణి కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాతపరీక్ష నిర్వహిస్తామని ప్రకటించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని ప్రకటించారు. అయితే డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల మంది దరఖాస్తు చేశారు.. ఈ పరీక్షకు కోసం అధికారులు బయోమెట్రిక్ విధానాన్ని వినియోగించారు. ఈ పరీక్షలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడం వంటి అక్రమాలను నిరోధించేందుకుగాను ఈ పద్ధతిని మొట్టమొదటిసారిగా ఉపయోగించారు. పరీక్షా కేంద్రాలలో ఉదయం 8 నుండి 9.30 వరకు మాత్రమే అభ్యర్థులను లోపలకు అనుమతించారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైనవారు దేహదారుఢ్య పరీక్ష, ఆ తర్వాత మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

త్రివిధ రైలు సేవల కూడలిగా
సెయింట్ థామస్ మౌంట్ స్టేషన్
7

# బహుభాషాకోవిదుడు దువ్వూరి



వేదికపై ఎస్పీ వసంతలక్ష్మి, జేకేరెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, నిర్మలా పళనివేలు, అనిల్‌కుమార్ రెడ్డి, విస్తాలి శంకరరావు, గుడిమెట్ల చెన్నయ్య

● 130వ జయంతి సభలో వక్తలు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై జన్మించిన గొప్ప కవుల్లో ఒకరు, నెల్లూరు జిల్లా పెమ్మారెడ్డిపాళెంలో రైతు కుటుంబంలో జన్మించిన 'దువ్వూరి రామిరెడ్డి' బహుభాషా కోవిదుడని, ఆయన భౌతికంగా మన మధ్యలేకపోయినా ఆయన రచనలు సజీవంగా ఉన్నాయని వక్తలు కొనియాడారు. జనని సాంఘిక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కవికోకిల దువ్వూరి రామిరెడ్డి 130వ జయంతి వేడుకలను ఆదివారం మైలాపూర్‌లోని అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు స్మారక భవనం వైఎస్ శాస్త్రి సభా ప్రాంగణంలో నిర్వహించారు. నిడమర్తి వసుంధర దేవి ప్రార్థనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతం పలుకగా, ప్రముఖ రచయిత్రి, జనని అధ్యక్షురాలు డా.నిర్మలా పళనివేలు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరులోని దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ కార్యదర్శి బి.సురేంద్రనాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా, పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు జలదంకి కోదండరామి రెడ్డి గౌరవ అతిథులుగా, ప్రముఖ గాయని ఎస్పీ వసంతలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిథులతో కలిసి దువ్వూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన సందర్భంగా నిర్మలా పళనివేలు మాట్లాడుతూ కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి అక్షరయజ్ఞం చేసి చిరంజీవిగా సాహితీ రంగంలో ఉన్నారని కొనియాడారు. తెలుగు, తమిళం, సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం, బెంగాలీ, పర్షియన్, జర్మన్, ఫ్రెంచ్ తదితర భాషల్లో ప్రశంసనీయమైన జ్ఞానాన్ని పొందడమే కాకుండా చిత్రకారుడు, శిల్పి, ఫోటోగ్రఫీ, సైన్స్, ఇంజనీరింగ్ రంగాల్లో కూడా రాణించిన బహుభాషాకోవిదుడని కీర్తించారు. దువ్వూరి రామిరెడ్డి తెలుగు సాహిత్యంలో మహాసముద్రంవంటివారని, మానవ జీవితాన్ని ప్రకృతితో, ప్రగతిశీల సమాజంతో ఏకం చేసిన గొప్ప మహాకవి అని కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. విద్యా, సాహితీ రంగాలకు జనని అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఇలాంటి సభల ద్వారా మన కవులను స్మరించుకోవడం మహానందమని విస్తాలి శంకరరావు అన్నారు. అనంతరం జలదంకి కోదండరామిరెడ్డి ప్రత్యేక పద్యాలను ఆలపించారు. ప్రముఖ గాయని ఎస్పీ వసంతలక్ష్మి దువ్వూరి ట్రస్ట్, జనని సంస్థల సాహితీసేవలను అభినందించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి బి.సురేంద్రనాథ్ రెడ్డి ట్రస్ట్ తరుపున ప్రత్యేకంగా తయారుచేయించిన జ్ఞాపికను జనని నిర్వాహకులకు అందజేసి ట్రస్ట్ సేవలను వివరించారు. అన్నదాతల కష్టాల కోసం సహజకవి దువ్వూరి రామిరెడ్డి రాసిన పద్యాలు ఆణిముత్యాలు వంటివని, వాటిని పుస్తకం రూపంలో ముద్రించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని తెలుగు సంఘాలకు, గ్రంథాలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన పేరుతో నడుపుతున్న ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా ఆరుగురు రచయితలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తున్నామని, ఈ సంవత్సరం ఈ అవార్డుతో పాటు ప్రత్యేక అవార్డును కూడా డిసెంబరులో అందజేయనున్నామని, ఈ అవార్డుకు జనని అధ్యక్షురాలు నిర్మలా పళనివేలును ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు పొణకా కనకమ్మ సేలను గుర్తించి ఆమెకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని, ఆమె పేరుతో ఉచిత మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆచార్య ఎల్‌బీ శంకర్‌రావు, తమ్మినేని బాబు, జడ మాల కొండయ్య, ఎన్‌వివి సారథి తదితరులు పాల్గొన్నారు.



'క్రిస్టినా కదిర్‌వేలన్' ఆడియో రిలీజ్

## గ్రామీణ ప్రేమ కథా చిత్రం 'క్రిస్టినా కదిర్‌వేలన్'

'క్రిస్టినా కదిర్‌వేలన్' గ్రామీణ ప్రేమ కథా చిత్రాన్ని డెబ్యూ డైరెక్టర్ ఎస్.జె.ఎన్. అలెక్స్ పాండియన్ తెరకెక్కించారు. కౌషిక్ రామ్, ప్రదీపా, సింగం పులి, గంజా కరుప్పు, జయకుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించగా, శ్రీలక్ష్మి డ్రీమ్ ఫ్యాక్టరీ పతాకంపై డాక్టర్ ఎస్.ఆర్.ప్రభాకర్ స్తపతి నిర్మించారు. ఈ సినిమా ఆడియో రిలీజ్ కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. ఇందులో చిత్రం బృందంతో పాటు సినీ ప్రముఖులు ఎస్ఆర్ ప్రభాకరన్, విజయ్, మైఖేల్ కే రాజా తదితరులు పాల్గొని ఆడియో విడుదల చేశారు. హీరో కౌషిక్ రామ్ మాట్లాడుతూ, 'సినిమా జర్నీ ఎంతో ఆసక్తిగా సాగింది. కుంభకోణంలో బస చేసి, స్థానికులతో కలిసిపోయి నటించాం. ఇది గ్రామీణ ప్రేమ కథ. అదీ కూడా వన్‌సైడ్ లవ్ స్టోరీ. ఒక ప్రేమకుడు తన ప్రేమను వ్యక్తం చేసేందుకు ఎలా తపిస్తాడు? ఆ విషయాన్ని తన మనసులో ఏ విధంగా దాచుకుంటారు? అనే విషయాలను దర్శకుడు ఎంతో ఆసక్తికరంగా తెరకెక్కించారు. అదేసమయంలో సమాజానికి అవసరమైన కొన్ని విషయాలను చెప్పారు. అందుకే ఈ మూవీ ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.

## మునీష్‌కాంత్ ప్రధాన పాత్రలో 'మిడిల్ క్లాస్'

ప్రముఖ నటుడు మునీష్‌కాంత్, విజయలక్ష్మి ప్రధాన పాత్రలు పోషించిన 'మిడిల్ క్లాస్' మూవీ ఈ నెల 21 న విడుదలకానుంది. 'రాచ్చసన్' 'ఓ మై కడవులే' 'మరగద నాణయం', 'బ్యాచిలర్' వంటి పలు హిట్ చిత్రాలను నిర్మించిన యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు కిషోర్ ముత్తురామలింగం దర్శకత్వం వహించారు. ఇతర పాత్రల్లో రాధారవి, మాళవిక అవినాష్, వడివేల్ మురుగన్, ఖురేషి, వేల రామమూర్తి తదితరులు నటించారు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు కిషోర్ మీడియా వివరిస్తూ, 'మధ్యతరగతి కుటుంబంలో జరిగే సంఘటనలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. సాధారణంగా ప్రతి కుటుంబంలో పైకి కనిపించే అంశాలుంటాయి. కానీ, కంటికి కనిపించని సంఘటనలు ఎన్నో ఉంటాయి. వీటికి హాస్యం, భావోద్వేగం, సెంటిమెంట్ తదితర అంశాలను జోడించి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. హాస్య నటుడిగా గుర్తింపు పొందిన మునీష్‌కాంత్ ఇందులో ప్రేక్షకులను కన్నీరుపెట్టిస్తారు. మధ్య తరగతి మహిళ పాత్రలో విజయలక్ష్మి జీవించారు. నటుడు మునీష్‌కాంత్ మాట్లాడుతూ, 'పెద్ద చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన విజయలక్ష్మి ఈ చిత్రంలో నా సరసన నటించేందుకు అంగీకరించడం గొప్ప విషయం. నటి విజయలక్ష్మి మాట్లాడుతూ, 'మునీష్‌కాంత్‌తో కలిసి నటించడం కొత్తం అనుభవం ఇచ్చింది. షూటింగ్ సమయంలో ఇంట్లో జరిగే గొడవల సన్నివేశాల చిత్రీకరణ చాలా ఆసక్తికరంగా సాగింది. మంచి నటీనటులతో నటించడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.



'మిడిల్ క్లాస్'లో ఓ దృశ్యం



'అనంతా' మూవీ నటీనటులు, కళాకారులతో దర్శకుడు సురేష్‌కృష్ణ

## సత్యసాయిబాబా జీవిత విశేషాలతో 'అనంత'

చిత్రజ్యోతి

కమల్‌హాసన్ నటించిన 'సత్యా', 'ఆలవందాన్', రజినీ నటించిన 'అన్నామలై', 'వీరా', 'బాషా' వంటి సూపర్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన స్టార్ డైరెక్టర్ సురేష్ కృష్ణ ప్రస్తుతం పుట్టపర్తి సాయిబాబా జీవిత విశేషాలపై 'అనంతా' పేరుతో ఓ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ మూవీలో జగపతి బాబు, సుహాసిని, వైజీ మహేంద్రన్, తలైవాసల్ విజయ్, నిళల్‌గళ్ రవి, శ్రీరంజని, అభిరామి వెంకటాచలం నటించారు. తమిళ, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రం తమిళ వెర్షన్‌కు ప్రముఖ గేయరచయిత పా. విజయ్ చక్కటి పాటలు, సంభాషణలు సమకూర్చారు. ఇన్నర్వ్యూ సంస్థ తరఫున గిరీష్ కృష్ణమూర్తి నిర్మించిన ఈ మూవీకి దేవా సంగీతం అందించారు. అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ మూవీని సత్యసాయిబాబా శతజయంత్యుత్సవం సందర్భంగా ఈ నెల 23న డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేయనున్నట్లు దర్శకుడు తెలిపారు.



ప్రమిదలను ఎండబెడుతున్న మనోహరన్

## కార్తీక దీపోత్సవానికి తయారవుతున్న మట్టి ప్రమిదలు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాల కోసం నగరంలో మట్టి ప్రమిదలు తయారవుతున్నాయి. కార్తీక మాసంలో దీపాలను మట్టి ప్రమిదల్లో వెలిగిస్తుంటారు. మట్టి ప్రమిదలో నువ్వుల నూనె పోసి దూదితో వత్తి తయారు చేసి వెలిగిస్తే లక్ష్మీదేవి ఇంటి కొలువవుతుందని భక్తుల విశ్వాసం.. అంతే కాకుండా పండితుల సమాచారం ప్రకారం దీపం త్రిమూర్తి స్వరూపం. దీపంలో మూడు రంగుల కాంతులుంటాయి. ఎర్రని కాంతి బ్రహ్మదేవునికి, నీలిరంగు శ్రీమహావిష్ణువుకు, తెల్లని కాంతి పరమేశ్వరుడికి ప్రతీకలు. ఆ కాంతి కాళ్ల మీద పడటం వల్ల నేత్రదృష్టిని మెరుగుపరుస్తుంది. ఇంతటి కీర్తిని సంతరించుకున్న దీపం మట్టి ప్రమిదకు సంబంధించినదైతే మరీ మంచిదని పండితోత్తములు చెబుతారు. ప్రస్తుతం నగరంలోని రాయపేట వద్ద మట్టి ప్రమిదలు శరవేగంగా తయారవుతున్నాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న మనోహరన్ (65) మట్టి ప్రమిదలను తయారు చేస్తున్నారు. మనోహరన్ పూర్వీకులంతా మట్టి ప్రమిదలు, కుండలు తయారుచేసినవారే. నేటి యువతరానికి మట్టి ప్రమిదల విలువ తెలియటం లేదని, దీపావళికి, కార్తీక దీపోత్సవానికి కొవ్వొత్తులు వెలిగిస్తున్నారు. మట్టి దీపాలను వెలిగిస్తే జరిగే మేలు గురించి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పొంగల్ సమీపిస్తుండటంతో తక్కువ ధరకు బంకమన్ను లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తమ జీవితం సాఫీగా నడుస్తుందని మనోహరన్ తెలిపారు.



మట్టి ప్రమిద తయారు చేస్తున్న మనోహరన్



అందంగా పేర్చిన మట్టి ప్రమిదలు

## ఆళ్వార్ల మందిర నిర్మాణ పూజలు



పూజలో నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని జగదాచార్య సహస్రాబ్ది స్మారక సభ ఆధ్వర్యంలో తిరువలంగాడు సమీపంలోని పళయనూర్ గ్రామంలో నిర్మించనున్న మందిర నిర్మాణం రెండో దశ పనులకు శ్రీకారం చుట్టారు. స్మారక సభ వ్యవస్థాపకులు ఊసూరు నందగోపాల్-లత దంపతుల పర్యవేక్షణలో 12 మంది ఆళ్వార్ల పేర్లతో మందిరాలను నిర్మిస్తున్నారు. శుక్రవారం జరిగిన పూజలో విశ్వాస్ బృంద సభ్యులు విష్ణుసహస్రనామ పారాయణం చేయగా, అర్చకులు యాగపూజ చేశారు. ఆళ్వార్ ఆచార్యుల మందిరాన్ని పలువురు దాతల సహకారంతో అద్భుత కళానైపుణ్యంతో నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కుట్రాలం వద్ద పర్యాటకుల సందడి



జలపాతం వద్ద సందడిచేస్తున్న పర్యాటకులు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతాల్లో గత వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెన్‌కాశి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కుట్రాలం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఇక్కడున్న ఐదు జలపాతాల వద్ద పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా స్నానాలు చేశారు. ఆదివారం తెల్లవారుజామునుంచే జలపాతాలు, పరసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం ప్రారంభమైంది. మరోవైపు కొండ ప్రాంతాల నుంచి వస్తున్న చల్లగాలులతో వాతావరణ మరింత ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఇక్కడున్న ఐదు జలపాతాల వద్ద పర్యాటకుల రద్దీ పెరిగింది. పర్యాటకుల సౌకర్యార్థం తెన్‌కాశి నుంచి ప్రభుత్వ రవాణా సంస్థలు, ప్రైవేటు ట్రావెల్ సంస్థలు కుట్రాలంకు ప్రత్యేక బస్సులు నడిపాయి.

## హొగెనేకల్, ఏర్కాడులో....



హొగెనేకల్ జలపాతంలో దోనె సవారీ చేస్తున్న పర్యాటకులు

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్, ఏర్కాడు తదితర పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగాంచిన ఏర్కాడును ప్రతిరోజూ పర్యాటకులు సందర్శిస్తుంటారు. ఆదివారం ఏర్కాడులోని పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. అన్నా పార్క్, బొటానికల్ పార్క్, పకోడా పాయింట్, లేడీస్ సీట్, సేర్వరాయన్ ఆలయం, కిళియూర్ జలపాతం తదితర ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా మారాయి. ఏర్కాడు బోట్ హౌస్‌లో పర్యాటకులు చాలాసేపు వేచి ఉండి, ఉత్సాహంగా బోటు సవారీ చేశారు. అలాగే, హొగెనేకల్‌కు ధర్మపురి, కృష్ణగిరి, సేలం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతాల వద్ద స్నానాలు చేస్తూ, దోనెల సవారీ చేస్తూ పర్యాటకులు ఉత్సాహంగా గడిపారు.

## ఇక...మాస్టర్ అన్బుమణి

● గౌరవ బ్లాక్ బెల్ట్ ప్రదానం



అన్బుమణికి బ్లాక్ బెల్ట్ ఇస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన కార్యక్రమంలో పీఎంకే నాయకులు అన్బుమణికి గౌరవ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే యూనిఫాంలో హాజరైన అన్బుమణి, బ్లాక్ బెల్ట్ అందుకున్నారు. నగరంలో జరిగిన వరల్డ్ ఆర్ట్స్ ఫెడరేషన్ కార్యక్రమంలో, అన్బుమణి సతీమణి సౌమ్య ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ వేదికపైనే అన్బుమణికి గౌరవ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశారు.

## తిరుచెందూరు తీరంలో భక్తులకు ఆంక్షలు లేవు

● పోలీసు శాఖ ప్రకటన

టి.నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు ఆలయ సమీపంలోని సముద్రతీరంలో రాత్రిపూట భక్తులు బసచేయడానికి ఎలాంటి ఆంక్షలు లేవని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. తిరుచెందూరు ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరంతా రాత్రిపూట సముద్రతీరంలో, ఆలయ ప్రాంగణాల్లో నిద్రించి మరుసటి రోజు వేకువజామునే సముద్ర స్నానాలు చేసి విశ్వరూప దర్శన సమయంలో సెంథిల్ ఆండవర్‌ను దర్శించుకోవడం ఆనవాయితీ. జూలై 7న ఆలయంలో మహా కుంభాభిషేకం జరిగిన తర్వాత ఆలయానికి వారాంతపు సెలవు దినాల్లో వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని మండపాల వద్ద సముద్రతీరం వద్ద కొత్తగా విద్యుత్ ఫోకస్ లైట్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. దీని కారణంగా సముద్రతీరంలో పడుకునే భక్తులకు ఇబ్బంది కలుగుతుందని భావించి ఆలయ నిర్వాహకులు శుక్రవారం రాత్రి సముద్రతీరం వద్ద ఎవరూ బసచేయకూడదని, ఆలయ ప్రాంగణం చుట్టూ రోజు రాత్రి బసచేయాలని తెలిపారు. ఈ విషయాన్ని ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది మైక్‌లో ఎనౌన్స్ చేశారు. దీంతో తిరుచెందూరు ఆలయం సమీపంలోని సముద్రతీరం వద్ద భక్తులు బసచేయడానికి ఆంక్షలు విధించారంటూ ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న ఆలయ ఉన్నతాధికారులు సముద్రతీరంలో రాత్రిపూట భక్తులు బసచేయడానికి ఎలాంటి ఆంక్షలు విధించలేవని స్పష్టం చేశారు. ఆలయం, పరిసరాల్లోని మంటపాల వద్ద ఏదైనా మరమ్మతులు జరుగుతున్నప్పుడు మాత్రమే భక్తులను సముద్రతీరంలో బసచేయవద్దని హెచ్చరిస్తుంటామని, అదే విధంగా వర్షాకాలంలోనూ సముద్రతీం వద్ద భక్తులు రాత్రిపూట బసచేయకుండా తాత్కాలికంగా ఆంక్షలు విధిస్తామని వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని తిరుచెందూరు పోలీసు ఉన్నతాధికారులు అధికారులు ధ్రువీకరించారు. ప్రస్తుతం రాత్రిపూట సముద్రతీరంలో భక్తులు బసచేయడానికి ఎలాంటి ఆంక్షలు లేవని ప్రకటించారు.



తిరుచెందూరు సముద్రతీరంలో స్నానాలకు వచ్చిన భక్తులు

### త్రివిధ రైలు సేవల కూడలిగా

## సెయింట్ థామస్ మౌంట్ స్టేషన్



పరంగిమలై మెట్రోరైలు మార్గం పై అంతస్థులో నిర్మించిన ఎంఆర్‌టీఎస్ మార్గం

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ థామస్ మౌంట్ (పరంగిమలై) రైల్వేస్టేషన్ మూడు విధాల రైలు సేవలకు ప్రత్యేక కూడలి (జంక్షన్)గా రూపుదిద్దుకోనుంది. బీచ్ స్టేషన్ నుంచి వేళచ్చేరి మీదుగా నడిచే మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎంఆర్‌టీఎస్) రైలు, లోకల్ విద్యుత్ రైలు, మెట్రోరైలు ఈ స్టేషన్ మీదుగా నడువనున్నాయి. వేళచ్చేరి నుంచి పరంగిమలైకి వచ్చే ఎంఆర్‌టీఎస్ రైలు మెట్రోరైల్వేస్టేషన్ రెండో అంతస్థుపై నడువనుంది. ఇక మెట్రోరైలు ఆదంబాక్కం నుంచి పరంగిమలై వరకు ఎంఆర్‌టీఎస్ రైలు మార్గం పై అంతస్థులో వెళ్లనుంది. పరంగిమలై మీదుగా చోళింగనల్లూరు వెళ్లే మెట్రోరైళ్లు ఈ మార్గంలోని మడిపాక్కం, కీళ్కట్టలై, కోవిలంబాక్కం, మేడవాక్కం, పెరుంబాక్కం మీదుగా వెళ్తాయి. ఇదే విధంగా వేళచ్చేరి, పరంగిమలై మధ్య వచ్చి వెళ్లే ఎంఆర్‌టీఎస్ రైలు ఆగే రైల్వే స్టేషన్ పరంగిమలై ప్రాంగణం రెండో అంతస్థులో టికెట్ల విక్రయ కేంద్రం, కార్యాలయ గదులు, సిబ్బంది విశ్రాంతి గదులున్నాయి. మెట్రో రైల్వేస్టేషన్ దిగువన ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్, మెట్రోరైల్వే స్టేషన్, పరంగిమలై రైల్వేస్టేషన్లకు ప్రయాణికులు వెళ్లేందుకు మెట్ల దారి, ఎస్కలేటర్, లిఫ్ట్ సదుపాయాలు కూడా ఉన్నాయి. ఈ మూడు రకాల సేవలతో పరంగిమలై (సెయింట్ థామస్) రైల్వేస్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇటీవలే రైల్వే భద్రతా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఐదు బోగీల రైలును వేళచ్చేరి - పరంగిమలై స్టేషన్‌ల మధ్య ట్రయల్ రన్ నిర్వహించారు. త్వరలో ఓ రైలును ప్రయాణికులతో నడిపి పట్టాల పటిష్టత పరీక్షించిన మీదట ఎంఆర్‌టీఎస్ రైళ్లను పరంగిమలై వరకు నడుపనున్నట్లు రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మూడు రకాల రైలు సేవలు అందుబాటులోకి వస్తే చెన్నై, తాంబరం, చెంగల్పట్టు ప్రాంతాల ప్రజలకు నగర శివారు ప్రాంతాలైన మడిపాక్కం, దాని పరిసర ప్రాంతాలకు సులువుగా చేరుకోగలుగుతారు. అదే విధంగా నగర శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సులువగా నగరం మధ్యలోని ఓఎమ్మార్, ఈసీఆర్, అడయార్, తిరువాన్మియూరు, బీసెంట్ నగర్, ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూరు, మందవెల్లి ప్రాంతాలకు చేరుకోగలుగుతారు.



పరంగిమలై ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్ రెండో అంతస్థులో టికెట్ కౌంటర్, కార్యాలయాలు



ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో భక్తులు

## తిరుచెందూర్ ఆలయంలో భక్తుల రద్దీ

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి, 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, దీపారాధన నిర్వహించిన అనంతరం కాల పూజ చేశారు. వేకువజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు, ఆలయం సమీపంలోని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఉదయం 5 గంటల నుంచి క్యూలైన్లలో వేచి స్వామి దర్శనం చేసుకున్నారు.

## 'ఐరన్ మాన్' పోటీల్లో అన్నామలై



సైక్లింగ్ చేస్తున్న అన్నామలై

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోవాలో జరిగిన 'ఐరన్ మాన్' పోటీల్లో రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై ఈత, పరుగు, సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. గోవాలో కొన్నేళ్లుగా ప్రతి ఏడాది 70.3 ట్రయల్‌థాన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఈత (1.9 కి.మీ), సైక్లింగ్ (90 కి.మీ), పరుగు పందెం (21.1 కి.మీ) తదితర అంతర్జాతీయ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పోటీల్లో పలు దేశాల క్రీడాకారులు పాల్గొంటుంటారు. ఈ క్రమంలో, ఈ ఏడాది పోటీల్లో రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పాల్గొన్నారు. ఈ పోటీల్లో అన్నామలై పాల్గొన్న వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వచ్చాయి.

### వలసరవాక్కం అష్టలక్ష్మీనగర్‌లో

## సత్యసాయిబాబా శతజయంత్యుత్సవం

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం అష్టలక్ష్మీనగర్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి బాబా శత వార్షికోత్సవాల సందర్భంగా వివిధ సేవాకార్యక్రమాలను నిర్వహించారు. జ్యోతి తిరుమణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాలు, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి వి.మహాలింగం, సేలం మాజీ కలెక్టర్ జె.చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి కే స్కంధన్, సినీ స్టంట్ డైరెక్టర్ జాగ్వార్ తంగం తదితరులు పాల్గొన్నారు. సాయిభజన అనంతరం 125 మంది నిరుపేదలకు చీరలు, ధోవతులు పంపిణీ చేశారు.



సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ గవర్నర్ తమిళిసైతో సమితి నిర్వాహకులు

## సమాచార దర్శిని

### రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.

**పల్లావరం:** కన్నన్ నగర్, రాధా నగర్, నెమిలిచ్చేరి, భారతిపురం, జమీన్ రాయపేట, నాయుడు కడై వీధి, లక్ష్మీ నగర్, జాయ్ నగర్, శాంతి నగర్, గణపతిపురం, రాధా నగర్ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, సుభాష్ నగర్, నటరాజపురం, నెమిలిచ్చేరి హైరోడ్డు, పెరియార్ నగర్, కురింజి నగర్, సెంథిల్ నగర్, నాదేశన్ నగర్, పోస్టల్ నగర్, ఏజీఎస్ కాలని, ఓంశక్తి నగర్, ముత్తుస్వామి నగర్, సోము నగర్, న్యూ కాలని ఏరియా, జీఎస్టీ రోడ్డు, సీఎల్‌సీ లైన్, హస్తినాపురం, పురుషోత్తమన్ నగర్ ఏరియా, భజన ఆలయ వీధి, జైన్ నగర్, ఎస్‌బీఐ కాలనీ, గజలక్ష్మి నగర్, ఎన్ఎస్ఆర్ రోడ్డు.

**ఎగ్మూర్:** సైడన్‌హామ్స్ రోడ్డు, డిపో వీధి, పీటీ ముదాలి వీధి, సామిపిళ్లై వీధి, ఏపీ రోడ్డు, హంటర్స్ రోడ్డు, జనరల్ కొలిన్స్ రోడ్డు, మాడెక్స్ వీధి, వీవీ ఆలయ వీధి, కురవన్‌కుళం, సుభహ నాయుడు వీధి, నెహ్రూ ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియం, అప్పారావు గార్డన్, పెరియతంబి వీధి, ఆండియప్పన్ వీధి, ఆనందకృష్ణన్ వీధి, పీకే ముదాలి వీధి, చూలై ఏరియా, కేపీ పార్క్, పెరంబూర్ బారక్స్ రోడ్డు, రోట్లర్ వీధి, కాలత్తియప్ప వీధి, విర్పూర్‌ముత్తయ్య వీధి, డాలి వీధి, మాణిక్యం వీధి, రంగయ్య వీధి, అష్టభుజం రోడ్డు, రాఘవ వీధి

### ప్లస్ వన్ విద్యార్థులకు 'ఆన్‌లైన్'లో బిజినెస్ ఎడ్యుకేషన్

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్ విద్యార్థులకు వ్యాపార విద్య (బిజినెస్ ఎడ్యుకేషన్)పై ఆన్‌లైన్‌లో ఉచిత కోర్సు అందించనున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 'స్వయం' వెబ్‌సైట్ ద్వారా ప్లస్ వన్ విద్యార్థులకు వ్యాపార విద్యపై ఉచిత ఆన్‌లైన్ కోర్సు అందించాలని నిర్ణయించింది. 24 వారాల కోర్సులో, పరిపాలన స్వభావం, నిర్వహణ సూత్రాలు, ప్రణాళిక, వ్యాపార వాతావరణం సహా ఎనిమిది విభాగాల్లో కోర్సులు బోధించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://swayam.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### నకిలీ డాక్టర్లపై ఫిర్యాదుకు ప్రత్యేక ఈ-మెయిల్

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్టర్లపై ఈ-మెయిల్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు. ఈ మేరకు ఆరోగ్య శాఖ విడుదలచేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ఉన్న ఆస్పత్రులు, వైద్య సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపింది. ఆ ప్రకారం, ఆస్పత్రులు, వైద్య సంస్థలు tncca.dmrhs.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించింది. తగిన విద్యార్హత లేకుండా వైద్యం చేసే నకిలీ డాక్టర్లపై tncca.dmrhs@gmail.com అనే ఈ-మెయిల్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఆరోగ్యశాఖ తెలిపింది.

### పాత ఓటర్ల జాబితా వివరాలు తెలుసుకునే అవకాశం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో ఓటర్లకు అవసరమైన 2002, 2005 సంవత్సరాల ఓటర్ల జాబితా వివరాలు తెలుసుకునేలా భారత ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం తన ఎక్స్ పేజీలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి... రాష్ట్రంలో 'సర్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతున్నట్టు తెలిపింది. ఇంటింటికి వెళ్తున్న పోలింగ్ బూత్ అధికారులు ఓటర్లకు ఫారాలు అందజేస్తున్నారు. ఆ ఫారాల్లోని వివరాలు పూర్తిచేసి అధికారులకు అందించాల్సి ఉంటుంది. కాగా ప్రజలు 2002, 2005 ఓటర్ల జాబితాలో తమ వివరాలు పరిశీలించేందుకు https://www.elections.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసామని, తమ ఓటరు గుర్తింపు కార్డు నెంబరుతో ఆ జాబితాలో పేర్లు ఉన్నాయా? లేవా? అనే వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

### నివాస ప్రాంతాల్లో విద్యుత్ వాహనం ఛార్జింగ్ తప్పనిసరి

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నివాస, వాణిజ్య ప్రాంతాల్లో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ సదుపాయం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం, 8 ఇళ్లకు మించి లేదా 750 చ.అ మించిన విస్తీర్ణంలో నిర్మించే నివాస ప్రాంతాలకు విద్యుత్ వాహనాల ఛార్జింగ్ సదుపాయం తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. అలాగే, 50 ఇళ్లకు మించిన పెద్ద నివాస ప్రాంతాల్లో, బయట నుంచి వచ్చే వారు ఉపయోగించుకునేలా సాధారణ రీ ఛార్జింగ్ సదుపాయం తప్పనిసరి చేసింది. నివాస ప్రాంతాలతో పాటు వాణిజ్య కాంప్లెక్స్‌లు, పారిశ్రామిక సంస్థల్లో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ వసతి తప్పనిసరి చేసింది. ఆ ప్రకారం, 300 చ.మీ విస్తీర్ణానికి పైగా ఉన్న పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య కాంప్లెక్స్‌ల్లో రీ ఛార్జింగ్ వసతి తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

# పేద విద్యార్థులకు విమాన యానం

● ప్రధానోపాధ్యాయురాలి సేవాగుణం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను సొంత ఖర్చుతో విమానం ఎక్కించిన ప్రధానోపాధ్యాయురాలిని పలువురు అభినందించారు. తూత్తుకుడి జిల్లా పండరాంపట్టిలో ఉన్న ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నెల్సన్ పొన్‌రాజ్ పనిచేస్తున్నారు. ఆమె తన సొంత ఖర్చుతో పేద కుటుంబాలకు చెందిన 17 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిపి మొత్తం 20 మందిని తూత్తుకుడి నుంచి విమానంలో నగరానికి తీసుకొచ్చారు. పేద విద్యార్థులు విమానం ఎక్కాలనే కల నెరవేర్చేందుకు ఈ పర్యటన ఏర్పాటుచేసినట్లు హెచ్ఎం తెలిపారు. కాగా, తూత్తుకుడి విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ఇళంభగవత్ విద్యార్థులను సాగనంపారు.



విద్యార్థులతో హెచ్ఎం నెల్సన్ పొన్‌రాజ్

## డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

● డ్రైవర్ మృతి



దగ్ధమైన కారు

టి.నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా తిరుత్తురైపూండి బైపాస్ రోడ్డులో ఆదివారం వేకువజామున ఓ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురైంది. డివైడర్‌ను ఢీకొన్న వెంటనే కారుకు నిప్పంటుని, క్షణాలలో మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. ఆ మంటల్లో చిక్కుకుని బయటకు రాలేక డ్రైవర్ దుర్మరణం చెందాడు. తిరుత్తురైపూండి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. కారు డ్రైవర్ వివరాలను కనుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

### విద్యుదాఘాతానికి ఇద్దరు యువకుల మృతి



మృతి చెందిన యువకులు (ఫైల్‌ఫొటో)

టి.నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి సమీపం త్యాగదుర్గం వద్ద వాటర్ సర్వీస్ సెంటర్‌లో కారు కడిగేందుకు ప్రయత్నించిన తెన్‌కీరనూరుకు చెందిన అరవిందన్ (27) అనే కారు డ్రైవర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఆ సమయంలో అరవిందన్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన ఆ సెంటర్‌లో పనిచేస్తున్న షాహిల్ (18) యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. వాటర్ సర్వీస్ సెంటర్ యజమాని షాజన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నీటమునిగి బాలిక సహా ఇద్దరి మృతి



రంజానా బేగం (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటమునిగిన బాలిక సహా ఇద్దరు మృతిచెందిన ఘటన తిరుప్పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. తారాపురం సుల్తానియాపురానికి చెందిన హసన్ మహ్మద్ (30)-సాజితా భాను దంపతులకు పిల్లలు లేరు. హసన్ మహ్మద్ సోదరుడు తైయూమ్ అన్సారీ-అనీషా ఫాతిమా దంపతులకు రంజానా బేగం (13) అనే కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు. బంధువుల ఇంటి వివాహం నిమిత్తం హసన్ మహ్మద్, తైయూమ్ అన్సారీ కుటుంబాలతో అలంగియం గ్రామానికి వెళ్లారు. శనివారం వివాహం అనంతరం అందరూ సమీపంలో అమరావతి నదికి వెళ్లారు. నదితీరంలో అందరూ స్నానం చేస్తుండగా, లోతైన ప్రాంతానికి వెళ్లిన రంజానా బేగం మునిగిపోయింది. గమనించిన హసన్ మహ్మద్ ఆమెను రక్షించే సమయంలో అతనూ నీటమునిగాడు. చుట్టుపక్కల వారి ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులతో కలసి నదిలో గాలించి ఇద్దరి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. అలంగియం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### విద్యార్థినిపై లైంగిక వేధింపులు..

● కానిస్టేబుల్ అరెస్ట్

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కానిస్టేబుల్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేయగా, అతడిని ఎస్పీ సస్పెండ్ చేశారు. విల్లుపురం జిల్లాకు చెందిన 10వ తరగతి చదివే బాలుడిని, అదే ప్రాంతానికి చెందిన ప్లస్ టూ విద్యార్థిని ప్రేమిస్తోంది. ఇద్దరు ఈ నెల 6వ తేది తల్లిదండ్రులకు చెప్పకుండా బైక్‌లో చెన్నై వచ్చారు. విషయం తెలియని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో, ఇద్దరు బైక్‌పై చెన్నై నుంచి దిండివనం వైపు బయల్దేరారు. బ్రహ్మదేశం మన్నార్‌స్వామి ఆలయం సమీపంలో వీరిని బ్రహ్మదేశం పోలీస్ స్టేషన్ పనిచేస్తున్న కానిస్టేబుల్ ఇళంగో అడ్డుకున్నారు. వారిని విచారించిన అనంతరం, విద్యార్థిని ఇంటికి వెళ్లాలని సూచించిన ఇళంగో, బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగిస్తానని తెలిపాడు. కానీ, అతను బాలికను పోలీస్ స్టేషన్ తీసుకెళ్లకుండా మార్గమధ్యంలో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం ఎవరికైనా చెబితే హతమారుస్తానని బెదిరించిన కానిస్టేబుల్ ఇళంగో, బాలికను తల్లిదండ్రులకు అప్పగించాడు. ఆ సమయంలో ఇళంగో తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాలిక చెప్పడంతో తల్లిదండ్రులు ఆరోవిల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి ఇళంగోను అరెస్ట్ చేశారు. విల్లుపురం ఎస్పీ శరవణన్ కానిస్టేబుల్ ఇళంగోను సస్పెండ్ చేశారు.

### డ్రగ్స్ విక్రయం కేసులో ముగ్గురి అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత కొన్నినెలలుగా తిరువళ్లూరు సహా పలు జిల్లాల్లో మాదకద్రవ్యాల విక్రయం సాగుతోందనే సమాచారంతో పోలీసులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, గత నెలలో తనిఖీ చేసిన తిరువళ్లూరు పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న మునీర్, జావీద్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి విచారించగా, ముంబయి నుండి మత్తు పదార్థాలను కొనుగోలు చేసి రాష్ట్రంలో కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. ఇందులో ప్రముఖ తమిళ యూట్యూబర్ శిబిరాజు కూడా ఈ ముఠాతో సంబంధాలున్నట్లు తెలిసి అతడి ఇంటికి వెళ్లగా పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో శిబిరాజ్ ఢిల్లీకి వెళ్లినట్లు తెలిసి అక్కడి పోలీసులకు తిరువళ్లూరు జిల్లా పోలీసులు సమాచారం అందించారు. ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి శనివారం ఉదయం అతడిని అరెస్ట్ చేసి తమిళనాడుకు తరలించారు. అనంతరం నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఈ ముగ్గురికి అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్లతో సంబంధాలున్నట్లు తెలిసింది. నైజీరియాకు చెందిన ఒకరు, కాంగో దేశానికి చెందిన మరొకరు వీరికి మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అనంతరం పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

## వీఏఓ హత్య కేసులో ఇద్దరు హిజ్రాల అరెస్టు



నిందితులు నివేద, శ్రీకవి



హతుడు రాజారామన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ నిర్వహణ అధికారి (వీఏఓ) హత్య కేసులో ఇద్దరు హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేశారు. నాగపట్టణం జిల్లా వాళకరై మెయిన్ రోడ్డుకు చెందిన రాజారామన్ (38) వెల్లం వీఏఓగా పనిచేస్తున్నాడు. రాజారామన్ 2024లో పట్టాలో పేరు మార్పు కోసం రూ.1,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. దీంతో రాజారామన్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి గురువారం నాగపట్టణం కోర్టులో విచారణకు రాజారామన్ హాజరయ్యారు. శుక్రవారం ఉదయం సెల్లూరు ప్రాంతంలోని బీచ్ రోడ్డులో ఓ వ్యక్తి మృతిచెంది పడి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అది రాజారామన్‌దిగా గుర్తించారు. మృతదేహం పక్కనే పడి ఉన్న బండరాయికి రక్తపు మరకలను గుర్తించారు. ఈ వ్యవహారంపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. కాగా, ఈ కేసులో నివేద, శ్రీకవి అనే ఇద్దరు హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేసి చేపట్టిన విచారణలో... మద్యం మత్తులో సెల్లూరు బీచ్‌లో నిద్రిస్తున్న రాజారామన్ నుంచి నగదు, సెల్‌ఫోన్, ఉంగరం తీసుకున్న వారిద్దరు, అతడి తలపై బండరాయితో కొట్టి హత్య చేసి పరారైనట్లు తెలిసింది. ఇద్దరి అరెస్ట్ చేసి పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

### మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జనవరి 2న వైగో పాదయాత్ర



టి.నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో రోజు రోజుకూ అధికమవుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని కోరు తూ, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో జనవరి 2 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాదిమంది ఓటర్ల ఓటు హక్కును హరించేలా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్‌ను ఖండిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో ఈ నెల 11 జిల్లా కేంద్రాల్లో జరుగనున్న నిరసన కార్యక్రమంలో తమ పార్టీ కూడా పాలుపంచుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమరవాణా, వినియోగాన్ని నిరోధించాలని డిమాండ్ చేస్తూ జనవరి 2న తిరుచ్చిలో పాదయాత్ర ప్రారంభించి మణప్పారై, దిండుగల్ మీదుగా జనవరి 12న మదురైలో పాదయాత్రను ముగించనున్నామని వైగో వివరించారు.

### ఈపీఎస్ నివాసం, పీఎంకే ఆఫీసుకు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నివాసానికి, పాట్టాలి మక్కల్ కట్చి కార్యాలయానికి బాంబు బెదిరింపులు రావటంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఈపీఎస్ నివాసం, టి.నగర్ తిలక్ రోడ్డులో ఉన్న పీఎంకే కార్యాలయంలో బాంబులు పేలనున్నాయని గుర్తు తెలియని వ్యక్తి డీజీపీ కార్యాలయానికి ఈమెయిల్ పంపాడు. ఈ విషయాన్ని అడయార్, టి.నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి తనిఖీలు జరిపారు. చివరకు అవి ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని తెలుసుకున్నారు.

### స్వలింగ సంపర్కానికి విద్యార్థిపై ఒత్తిడి

● టీచర్ అరెస్ట్

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి విద్యార్థిని స్వలింగ సంపర్కంతో వేధించిన ఉపాధ్యాయుడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా తిరుపాలతురై ప్రాంతానికి చెందిన బాలసుబ్రమణియన్ (29) పాపనాశంలోని ఓ స్కూల్లో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అతడిని పాఠశాల యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో,ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థితో బాలసుబ్రమణియన్ స్వలింగ సంపర్కానికి పాల్పడినట్లు సమాచారం. ఆ విద్యార్థి ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలుపడంతో వారు, స్వామిమలై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద బాలసుబ్రమణియన్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ అధ్యక్షుడు లోకనాథుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కుశల్ చంద్‌జైన్, టీఎస్.ఎం.గురుమూర్తి, సంపత్, విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, భరణిబాబు, సతీష్‌కుమార్, ప్రకాష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారి కార్మికులకూ మూడు పూటలా ఆహారం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఆహార పథకాన్ని ఈ నెల 15వ తేది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఈ పథకంలో రహదారి కార్మికులను కూడా చేర్చాలని జీసీసీ నిర్ణయించింది. పట్టణ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత భోజన పథకం ప్రారంభించనున్నట్టు గత నెల 4వ తేది రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలివిడతగా, జీసీసీలో పరిధిలోని పారిశుధ్య కార్మికులకు మూడు పూటలా ఆహారం అందించనున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, జీసీసీ పరిధిలోని 30వేల మందికి ఆహారం అందించేందుకు రూ.186 కోట్లు కేటాయించింది. ఈ పథకాన్ని ఈ నెల 15న సీఎం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో, జీసీసీలో పనిచేస్తున్న రహదారి కార్మికులను కూడా ఈ పథకంలో చేర్చాలని నిర్ణయించారు. జీసీసీలో 1,800 మంది రహదారి కార్మికులున్నారు. వారిలో ఆఫీసు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు వంటి వారికి ఈ పథకం వర్తించదు. రోడ్డు మరమ్మతులు చేసే కార్మికులకు మాత్రమే ఆహారం అందించనున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

### వైద్య కోర్సుల్లో 802 సీట్లు ఖాళీ

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సులకు సంబంధించి అఖిల భారత కోటా సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ మునిగిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా 802 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయని భారత వైద్య మండలి తెలిపింది. రాష్ట్రంలో 136 సీట్లున్నాయి. అందులో 9 సీట్లు మదురై ఎయిమ్స్‌లోను, 22 సీట్లు రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీ ఉన్నాయి. మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 389 అఖిల భారత కోటా సీట్లు, 334 వైద్య విశ్వవిద్యాలయాలు, కేంద్ర విద్యాసంస్థల్లో 38 సీట్లు సీట్లు భర్తీ కాలేదు. తొలివిడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు, చేరకుండా ఉంటే, ఎలాంటి జరిమానా లేకుండా రెండో విడత కౌన్సెలింగ్‌కు అనుమతించారు. కానీ, మూడో విడత కౌన్సెలింగ్‌లో సీటు పొంది నిరాకరిస్తే, ప్రభుత్వ వైద్యకళాశాల సీట్లకు రూ.10,000, స్వయంప్రతిపత్తి విశ్వవిద్యాలయాలకు రూ.2 లక్షలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వాటితో పాటు కళాశాల ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని, ఖాళీ సీట్ల భర్తీకి త్వరలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు భారత వైద్య కౌన్సెలింగ్ కమిటీ తెలియజేసింది.

### రామాభ్యుదయ కావ్య సౌందర్యంపై 30న తాతా సందీప్ శర్మ ప్రసంగం

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాసం ఈనెల 30న జరుగనుంది. ధారావాహిక 167వ ప్రసంగ కార్యక్రమంగా హైదరాబాద్‌కు చెందిన సుప్రసిద్ధ శతావధాని డాక్టర్ తాతా సందీప్ శర్మ ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమం టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఈ నెల 30 సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుందని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

## ఒకేరోజు 45.98 మెట్రిక్ టన్నుల వ్యర్థాల సేకరణ



పాత సామగ్రిని సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 8వ తేది (శనివారం) 45.98 మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాలు సేకరించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... నగరంలోని ఇళ్లకు పారిశుధ్య కార్మికులు వెళ్లి ప్రతిరోజు సుమారు 6,500 మెట్రిక్ టన్నుల పొడి, తడి చెత్త, వెయ్యి మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు సేకరిస్తున్నారు. ప్రతి శనివారం ఇళ్ల వద్దకే వెళ్లి పాత ఫర్నిచర్ సేకరించాలని జీసీసీ నిర్ణయించి గత నెల 11వ తేది దీనిని ప్రారంభించింది. ఆ ప్రకారం, అక్టోబరు 11,18,25, నవంబరు 1వ తేది తదితర శనివారాల్లో 584 మంది నుంచి 225.76 మెట్రిక్ టన్నుల పాత సామగ్రి కేటాయించారు. ఆ ప్రకారం, ఈ నెల 8వ తేది 131 మంది నుంచి 45.98 మెట్రిక్ టన్నుల పాత సామానులు సేకరించి, కొడుంగైయూర్‌లో దహన కర్మాగారానికి దహనం చేశారు. ప్రతి శనివారం పాత సామగ్రి సేకరణ జరుగుతుందని, యజమానులు 'నమ్మ చెన్నై' యాప్ ద్వారా, 1913 అనే నెంబరు, 9445061913 అనే వాట్సాప్ నెంబరును సంప్రదించి తమ వివరాలు తెలియజేస్తే, పారిశుధ్య కార్మికులు వారి ఇంటికే వెళ్లి పాత సామానులు సేకరిస్తారని జీసీసీ తెలిపింది.

## హత్య కేసులో తండ్రి, కుమారుడు సహా ఐదుగురికి యావజ్జీవ శిక్ష

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సమీపంలో పాతకక్షల కారణంగా చెన్నైకి చెందిన యువకుడి హత్యకేసులో తండ్రి, కుమారుడు సహా ఐదుగురికి న్యాయస్థానం యావజ్జీవశిక్ష విధించింది. తూత్తుకుడి సమీపం కులసైకరిసల్ ప్రాంతానికి చెందిన పొన్ నిమేష్ (35) చెన్నైలోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. తన సోదరిని హేళన చేసిన వ్యవహారంలో, అదే ప్రాంతానికి చెందిన సుభాకర్ (32)తో పొన్‌నిమేష్ మధ్య ఘర్షణ నెలకొంది. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుమేరకు పుదుకోట పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో, తనకు వివాహం నిశ్చయం కావడంతో 2015 ఏప్రిల్ 26న పొన్‌నిమేష్, తొలి శుభలేఖను ఆ ప్రాంతంలోని ఆలయంలో ఉంచి పూజలు చేసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని ముఠా అతడిని చుట్టుముట్టి మారణాయుధాలతో దాడిచేసి పరారైంది. ఈ ఘటనలో పొన్‌నిమేష్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కేసు నమోదుచేసిన పుదుకోట పోలీసులు, అదే గ్రామానికి చెందిన పొన్‌శేఖర్(70), అతని కుమారుడు సుభాకర్(32), బంధువులు రమేష్(30), సురేష్(28), మాడస్వామి(31)లను అరెస్ట్ చేశారు. ఈ కేసు తూత్తుకుడి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టులో జరుగుతుండగా నిందితులు పొన్‌శేఖర్, సుభాకర్, రమేష్, సురేష్, మాడస్వామిలకు తలా యావజ్జీవ శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తాండవం శనివారం తీర్పు చెప్పారు.

### మృతిచెందిన టీవీకే కార్యకర్తకు ఇల్లు



భూమి పూజ చేస్తున్న టీవీకే నేతలు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన కార్యకర్తకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) నిర్వాహకులు ఇల్లు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. విక్రవాండిలో జరిగిన టీవీకే తొలి మహాసభలో పాల్గొన్న కీల్పాక్కంకు చెందిన ఛార్లెస్ అనే కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఛార్లెస్ మృతిచెందిన ఏడాది అయిన సందర్భంగా ఆయన కుటుంబానికి టీవీకే ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఛార్లెస్ మృతిచెందిన సమయంలో, ఆయన కుటుంబాన్ని ఓదార్చేందుకు టీవీకే నేతలు వెళ్లిన సమయంలో, తమకు సొంత ఇల్లు కూడా లేదని ఛార్లెస్ కుటుంబ సభ్యులు ఆవేదనతో తెలిపారు. ఈ విషయమై టీవీకే అధ్యక్షులు విజయ్ ఉత్తర్వులతో, ఇల్లు నిర్మించి ఇవ్వనున్నామని ఆ పార్టీ నేతలు తెలిపారు.

### ప్రజలతో కలిసిమెలిసి ఉండటం నేర్చుకో

● విజయ్‌కి నత్తం విశ్వనాథన్ సలహా



మాజీ మంత్రి నత్తం విశ్వనాథన్

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో రాణించాలంటే ముందు ప్రజలతో కలిసిమెలిసి ఉండటం నేర్చుకోవాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి నత్తం విశ్వనాథన్ సలహా ఇచ్చారు. దిండుగల్ అన్నాడీఎంకే కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీ నేతల సమావేశంలో నత్తం విశ్వనాథన్ పాల్గొని మాట్లాడుతూ, 2026 అసెంబ్లీ ఎన్నికల పొత్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకోని విజయ్ సీఎం అభ్యర్థి తానేనని, ముఖ్యమంత్రి పదవి తననే వరిస్తుందని కలగంటున్నారని, ఇది ఎన్నటికీ నెరవేరబోదన్నారు. డీఎంకేలో ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఎంజీఆర్ ఆ పార్టీ తీరు నచ్చక వైదొలిగి ప్రజల మద్దతుతో అన్నాడీఎంకే స్థాపించి అనతి కాలంలోనే ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఒక వైపు సినీ రంగం, మరోవైపు రాజకీయాల్లో చక్రం తిప్పిన ఎంజీఆర్‌లా రాణించాలని విజయ్ భావిస్తున్నారని, పది సినిమాల్లో నటించినంత మాత్రాన సీఎం కాలేరన్నారు. రాజకీయాల్లో చక్రం తిప్పాలంటే ముందు ప్రజలతో కలిసిమెలిసి ఉండాలని, దీనిపై ప్రత్యేక శిక్షణ పొందాలని విజయ్‌కు నత్తం విశ్వనాథన్ సూచించారు.


### వ్యర్థాలకు నిప్పు

● ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు



వేలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఓల్డ్ బైపాస్‌రోడ్డు ప్రాంతంలో ని మెకానిక్ దుకాణాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను వేలూరు కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ఆదివారం నిప్పింటించారు. దీంతో ఆ మంటలు అక్కడున్న మెకానిక్ దుకాణాల వరకు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, మెకానిక్ వస్తువుల దుకాణాలున్న ప్రాంతంలో పడేవేస్తున్న చెత్తలో ఇనుము, అల్యూమినియం కోసం పారిశుధ్య కార్మికులు చెత్త కాల్చివేసి ఇనుము తీసుకుంటారని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆ మంటలు దుకాణాలకు వ్యాపించి భారీ ఆస్తి నష్టం ఏర్పడితే ఆ బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై వేలూరు కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### వేలూరులో ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

వేలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూనిఫాం సర్వీస్ సెలక్షన్ బోర్డు (టీఎన్‌యూఎస్ఎస్‌బీ) లెవల్-2 పోలీస్ కానిస్టేబుల్, జైలు గార్డులు, అగ్నిమాపక సిబ్బంది నియామకానికి సంబంధించి వేలూరు జిల్లాలో ఆదివారం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులకు ఆదివారం వేలూరు వీఐటీ కళాశాల, తోరప్పాడి, థాత్తి పెరియార్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీపురం స్పార్క్ స్కూల్ అనే ముడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు మొత్తం 9,561 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. వేలూరు ఎస్పీ మయిల్‌వాహనం పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. అదే విధంగా తిరుపత్తూరు, రాణిపేట జిల్లాల్లో జరిగిన పరీక్షలను డీఐజీ ధర్మరాజన్ పరిశీలించారు.

### తేజస్వి యాదవ్‌కు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధ్యక్షులు తేజస్వి యాదవ్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తేజస్వి యాదవ్ ఆదివారం తన 36వ పుట్టినరోజు జరుపుకున్నారు. తేజస్వికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... 'తమ్ముడు తేజస్వి యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. బిహార్‌లో పునరుజ్జీవింపబడుతున్న సామాజిక న్యాయ ఉద్యమానికి మీరు ఒక చోదకశక్తిగా ఎదిగి, లక్షలాది మందికి ఆశాకిరణంగా మారారు. మీ నేతృత్వంలో ఒక అధ్యాయం ప్రారంభమై, బిహార్‌లో సమానత్వం, నాణ్యమైన విద్య, ఉద్యోగాలు, గౌరవం కోరుతున్న ప్రజల కలను మీరు నెరవేరుస్తారని ఆశిస్తున్నాను. మీకు బలం, మంచి ఆరోగ్యం, ధైర్యంతో ఈ చారిత్రాత్మక మార్గంలో కొనసాగాలని నేను కోరుకుంటున్నాను' అంటూ ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

### కుమరిలో బోట్ సవారీ వేళల పెంపు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రం మధ్యలోని వివేకానంద రాక్, తిరువళ్లూర్ విగ్రహం వరకు నడిపే బోట్ సవారీ సమయాన్ని ఒక గంట పొడిగించారు. ఈ మేరకు పుంపుహార్ నౌకాయాన సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... కన్నియాకుమారిలో వివేకానంద రాక్, తిరువళ్లూర్ విగ్రహాల వద్దకు పర్యాటకులకు వెళ్లేలా గుహన్, పొదిగై, వివేకానంద పేరుతో మూడు పడవలు నడుపుతున్నామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పడవలు అందుబాటులో ఉన్నాయి. శబరిమల సీజన్ కావడంతో కన్నియాకుమారికి అయ్యప్ప భక్తుల తాకిడి పెరిగింది. పర్యాటకుల విజ్ఞప్తి మేరకు పడవ సేవల సమయాన్ని ఒక గంట పొడిగించారు. ఆ ప్రకారం, ఈ నెల 17వ తేది నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పడవల సేవలు 7 గంటలకే ప్రారంభం కానున్నాయి. ఉదయం 6.45 నుంచి టిక్కెట్ల విక్రయం జరుగుతుందని పుంపుహార్ సంస్థ తెలిపింది